నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 28 నవంబర్ 2024 | HYDERABAD

తన పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీస్సులు తీసుకుంటున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

-ఉప్పల్

# చరిత్రలో నిలిచిన కేసీఆర్ ఆమరణ దీక్ష

### 29న దీక్షా దివస్‌ను విజయవంతం చేద్దాం

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట, నవంబర్ 27: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన పోరులో ఉద్యమ నేత కేసీఆర్ తన ప్రాణాలకు తెగించి చేసిన ఆమరణ దీక్ష చరిత్రలో నిలిచిపోయిందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమ నేత కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష..ఢిల్లీ పెద్దలను కదిలించిన తీరు ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాల్సిన ఘట్టమన్నారు. బుధవారం మారేడ్‌పల్లిలోని తన నివాసంలో జరిగిన సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశంలో ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ దీక్షా దివస్ నేపథ్యంలో 29న మధ్యాహ్నం 2.30 గంటల వరకు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులంతా కలిసి బేగంపేట పాటిగడ్డలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌కు తరలిరావాలని, అక్కడి నుంచి దదాపు 3 వేల బైక్‌లతో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వరకు, తిరిగి అక్కడి నుంచి భారీ సమూహంతో తెలంగాణ భవన్‌కు చేరుకోవాలన్నారు.

# డిసెంబర్ 11 వరకు కార్యక్రమాలు

### ఎమ్మెల్సీ మహమూద్ అలీ

మలక్‌పేట, నవంబర్ 27: ఈ నెల 29 న నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ మహమూద్ అలీ బీఆర్ఎస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను కోరారు. బుధవారం సాయంత్రం ఆజంపురా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీక్షా దివస్‌ను పురస్కరించుకొని మలక్‌పేట నియోజకవర్గంలోని అక్బర్ బాగ్ దిల్‌కుశ ఫంక్షన్‌హాల్లో హయ్యత్ హుస్సేన్ హబీబ్ ఆధ్వర్యంలో రక్తదాన, కంటి వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. దిక్షా దివస్‌ను పురస్కరించుకొని ఈ నెల 29 నుంచి డిసెంబర్ 11 వరకు 11 రోజుల పాటు మలక్‌పేట నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి ఆజం అలీ, నాయకులు బాబు సుదర్శన్, భూమేశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, అజిత్‌రెడ్డి, హయ్యత్ హుస్సేన్ హబీబ్, నర్సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, సల్మాన్ మహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణభవన్‌కు తరలిరావాలి

### ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, నవంబర్ 27 : తెలంగాణ భవన్ లో ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో బైక్‌లతో భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ వెల్లడించారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, ముఖ్య నేతల అత్యవసర సమావేశం బుధవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన పద్మారావు గౌడ్ మాట్లాడారు.

# కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ

### ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్: కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష వల్లే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్ కమ్యూనిటీహాల్‌లో దీక్షా దివస్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 29న రాంనగర్ చౌరస్తాలోని అమరవీరుల స్థూపం వద్దకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

**రాజు తలిస్తే దెబ్బలకు కొదువా?**

బఫర్ జోన్, పార్క్ స్థలాలను అంగుళం కబ్జా చేస్తే హెచ్ఎండీఏ అధికారులు విరుచుకుపడతారు. అలాంటి హుడా చేసిన లే అవుట్‌లో పార్క్‌గా చూపిన స్థలాన్ని ఇప్పుడు ప్లాట్లుగా డెవలప్ చేయడం తప్పు కాదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఈ విషయం వివాదాస్పమైంది. ఈ లే అవుట్ విషయంలో హెచ్ఎండీఏ ఎలా వ్యవహరిస్తుందనే అంశం చర్చనీయాంశంగా మారింది. అయితే హెచ్ఎండీఏ వర్గాల నుంచి మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# సామాన్యుడు చేస్తే తప్పు.. సర్కారు చేస్తే ఒప్పా?

## బఫర్ జోన్‌లో లే అవుటా?

సిటీబ్యూరో: రాజు తలిస్తే దెబ్బలకు కొదువ అన్నట్లు హెచ్ఎండీఏ అధికారులు వ్యవహరిస్తున్నారు. తెలియక తప్పు చేసిన సామాన్యుడిని ముప్పు తిప్పలు పెట్టే... ప్రభుత్వ యంత్రాంగమే తప్పటడుగులు వేసేందుకు సిద్ధమైంది. పచ్చని చెట్లతో నిండి, పక్కన పారే నాలా వెంబడి భారీ వెంచర్‌కు సన్నాహాలు చేసింది. ప్లాట్లను వేలం వేస్తే భారీ ఆదాయం వస్తుందని భావించి పెద్ద ప్లాను గీసింది. కానీ స్థానికుల ఫిర్యాదుతో పటాపంచలైంది. బంజారాహిల్స్ రోడ్ నం. 12లో ఉండే ఎమ్మెల్యే కాలనీ సమీపంలో హుడా ఉన్నప్పుడే ఖాళీ జాగాలను ప్లాట్లు చేసి విక్రయించారు. అప్పటి నుంచే ఇబ్బడిముబ్బడిగా నిర్మాణాలతో బంజారా హిల్స్ రూపురేఖలే మారిపోయాయి. దానికి అనుగుణంగా డిమాండ్ కూడా భారీగానే పెరిగింది. కానీ హుడా వేసిన లే అవుట్‌ను ఇప్పుడు రివైజ్ చేస్తూ 12 ఎకరాల విస్తీర్ణంలో ప్లాట్లను డెవలప్ చేసేందుకు ఏర్పాటు చేశారు.

### 90 దశకంలోనే..

90 దశకంలోనే బంజారాహిల్స్‌లో హుడా హైట్స్ పేరిట భారీ లే అవుట్ అభివృద్ధి చేసి ప్లాట్లను విక్రయించారు. అదే సమయంలో పచ్చదనం పెంపొందించేలా, పార్కు కోసం స్థలాన్ని విడిచి పెట్టారు. అయితే ఆ పార్కును ఆనుకుని కొన్ని ప్లాట్లను వేలంలో విక్రయించారు. కానీ ఆ తర్వాత భూముల ధరలు విపరీతంగా పెరగడంతో.. ఇన్నాళ్లు ఖాళీగా ఉంటూ అభయారణ్యాన్ని తలపించే ఈ 12 ఎకరాల స్థలం చిన్న చిట్టడవిగా మారింది. వృక్ష సంపదతోపాటు, అరుదైన పక్షులు కూడా ఆవాసంగా ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాయి. కానీ ఇంతలోనే ఆ ప్రాంతాన్ని లే అవుట్‌గా డెవలప్ చేసేందుకు ఆగస్టులో హెచ్ఎండీఏ పనులను మొదలుపెట్టింది.

**ఆదాయం కోసం హెచ్ఎండీఏ వెంపర్లాట**

**బంజారాహిల్స్‌లో 12 ఎకరాల లే అవుట్‌కు సన్నాహాలు**

**స్థానికుల ఫిర్యాదుతో హైకోర్టు మొట్టికాయలు**

### • హైకోర్టు మొట్టికాయలు

లోటస్ పాండ్ నుంచి బయటకు వెళ్లే వరద నీటితో పాటు, డ్రైనేజీ ప్రవహించే నాలా వెంబడి నిర్మిస్తున్న ఈ లే అవుట్ బఫర్ జోన్‌లోనూ చదును చేస్తున్నారని స్థానికుల వాదన. దీంతో పాటు, ఒకప్పటి పార్క్ స్థలాన్ని లే అవుట్లుగా డెవలప్ చేసి అమ్ముకోవాలని హెచ్ఎండీఏ చూసింది. కానీ స్థానికుల ఫిర్యాదుతో ఈ వ్యవహారం వివాదంగా మారింది. కామన్ ఏరియాగా చూపిన ఈ స్థలాన్ని లే అవుట్‌గా చేయడం వెనుక అంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా ఒకప్పుడు పార్కు స్థలాన్ని ఇప్పుడు ప్లాట్లుగా ఎలా డెవలప్ చేస్తారని హైకోర్టు మొట్టికాయలు వేసింది. దీనిపై స్థానికుల ఫిర్యాదును విచారించిన హైకోర్టు.. పార్కు స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని ఆదేశించింది. అయితే కేవలం లే అవుట్ చేయడం లేదని, డెవలప్‌మెంట్ కార్యాకలాపాలు నిర్వహిస్తున్నామని హెచ్ఎండీఏ అధికారులు వివరించారు.

# తప్పలెన్ని చేసినా.. అండా దండా

**సెటిల్‌మెంట్ కింగ్‌లకు రాజకీయ అండ**

**ఏం చేసినా.. ఎవరూ ఏమీ చేయలేరనే ధీమా**

**పోలీస్ శాఖలో కొందరు అధికారుల తీరిది**

**చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారుల దాటివేత ధోరణి**

**సీపీలో అప్పుడున్న దూకుడు ఏమైందనే చర్చ**

సిటీబ్యూరో: ఏ తప్పు చేసినా.. రక్షించేందుకు రాజకీయ నాయకులైన గాడ్ ఫాదర్స్ ఉన్నంత వరకు తమను ఎవరు ఏమీ చేయాలేరనే ధీమాతో నగరంలో కొందరు పోలీస్ అధికారులు చెలరేగిపోతున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న కొందరు సీఐలు, ఏసీపీలపై వచ్చిన అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై ఉన్నతాధికారులు అంతర్గత విచారణ చేసి చర్యలు తీసుకోవాలని చూసినా.. వారిని నీడలా కాపాడే రాజకీయ నాయకులైన గాడ్ ఫాదర్స్ ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తెచ్చి తమ వారిపై ఈగ వాలనీయకుండా ఉండేలా చూసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. హైదరాబాద్ కమిషనర్‌గా గతంలో పనిచేసిన కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సమయంలో ఆరోపణలొస్తే వెంట వెంటనే ఆయన అంతర్గత విచారణ చేసి..ఏకంగా పంజాగుట్ట ఠాణాలోని సిబ్బందినే పూర్తిగా మార్చేశారు. ఆయన బదిలీపై వెళ్లిన తరువాత రెండోసారి సిటీ సీపీగా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్ అన్ని విషయాలపై అచితూచి అడుగులేస్తున్నారు. ఆయన మొదటి సారి హైదరాబాద్ సీపీగా పనిచేసిన సమయంలో ఉన్న దూకుడు ఇప్పుడు చూపించడం లేదనే చర్చ కూడా నగర పోలీసుల విభాగంలో కొనసాగుతున్నది.

### సారీతో సద్దుమణిగించారా..?

ఈస్ట్‌జోన్‌లో ఓ స్టేషన్‌లో నెల రోజుల కిందట అన్నదమ్ములను స్టేషన్‌కు బలవంతంగా తీసుకొచ్చి చితకబాదారు. ఎందుకు వాళ్లను స్టేషన్‌కు తీసుకొచ్చి కొట్టారని ఉన్నతాధికారులు ఆరా తీస్తే, ఒక కాంగ్రెస్ నాయకుడు వాళ్ల వద్ద మామూళ్ల కోసం ప్రయత్నం చేశాడని, వాళ్లు ఇందుకు ఒప్పుకోకపోవడంతో స్థానిక ఇన్‌స్పెక్టర్‌తో వాళ్లకు భయం తెప్పించాలనుకున్నాడు. అప్పటికే ఆ ఇన్‌స్పెక్టర్ స్థానిక ఏసీపీకి కూడా వాళ్లపై ఒక కన్నుంది. దీంతో తమ గాడ్ ఫాదర్ అయిన స్థానికంగా ఉండే రాజకీయ నాయకుడు ఆదేశించాడని, బలవంతంగా అన్నదమ్ములను స్టేషన్‌కు తీసుకొచ్చి చితకబాదారు. స్థానిక ఇన్‌స్పెక్టర్, ఏసీపీపై బాధితులు సీపీకి కూడా ఫిర్యాదు చేశారు. అయితే సీపీకి బాధితులు ఫిర్యాదు చేసిన మరుసటి రోజే ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు మరో అధికారితో కలిసి బాధితుల ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. అక్కడకు వెళ్లి సారీ చెప్పినట్లు సమాచారం. తమ గాడ్ ఫాదర్స్‌తో ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు ఉన్నతాధికారులకు చెప్పించి.. ఒప్పించారనే విమర్శలు వస్తున్నాయి.



### సెటిల్‌మెంట్ల కింగ్..

ఈస్ట్‌జోన్‌లోనే మరో ఏసీపీ తన స్టేషన్ పరిధిలో సివిల్ సెటిల్‌మెంట్లు చేయడంలో కింగ్‌గా మారాడనే విమర్శలు వస్తున్నాయి. ఈయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే ఎవరూ పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. ఆ ఏసీపీ వేధింపులకు తట్టుకోలేక హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. ఆయనపై పలు ఆరోపణలున్నా, ఆయనపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనామేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

### డీల్ కుదుర్చడంలో..

సెంట్రల్ జోన్‌లో ఓ ప్రార్థన మందిరం విషయంలో రెండు వర్గాల మధ్య చాలా రోజులుగా వివాదం నడుస్తున్నది. ఒక వర్గంలో ఆధీనంలో ఉన్న పొజిషన్‌ను మరొకరికి ఇప్పించేందుకు స్థానిక ఏసీపీ రూ. 50 లక్షలకు డీల్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఏసీపీతో డీల్ కుదుర్చడంలో ఒక రాజకీయ నాయకుడు కీలక పాత్ర పోషించాడనే విమర్శలున్నాయి. అలాగే సదరు రాజకీయ నాయకుడు ప్రభుత్వంలోని పెద్దలతో మాట్లాడి ఆ ఏసీపీపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేలా తన వంతు పాత్ర పోషించాడు. ప్రభుత్వంలోని కొందరు పెద్దలు కూడా రంగంలోకి దిగి, ప్రార్థన మందిరం వ్యవహారానికి సంబంధించి ఏసీపీ గురించి కాని ఎవరూ బయట మాట్లాడవద్దని హుకూం జారీ చేసినట్లు తెలిసింది.

స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన కమిషనర్ ఇలంబర్తి, మేయర్, సభ్యులు

**ఒక్కొక్కటిగా సీఎస్ఆర్ కింద అప్పగిస్తున్న బల్దియా**

**లక్ష్యాలను మరిచి ఇతర అవసరాల పేరిట భవనాల ప్రైవేట్ పరం**

**మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం**

**పలు నిర్ణయాలకు ఆమోదం**

# మోడల్ మార్కెట్లు ఇక ప్రైవేట్‌కు

సిటీబ్యూరో: గ్రేటర్‌లో మోడల్ మార్కెట్లను ఇతర అవసరాల పేరిట ప్రైవేట్ పరం చేసే పనిలో ఉన్నారు. వాస్తవంగా అందుబాటులోకి వచ్చిన చోట స్థానికులకు సూపర్‌మార్కెట్లలా ఈ మోడల్ మార్కెట్లు ఉపయోగపడాలి. కానీ మోడల్ భవనాలను ఏకంగా సీఎస్ఆర్ కింద ఫౌండేషన్లకు అప్పగిస్తున్నారు. ఇప్పటికే సీఎస్ఆర్ కింద డాక్టర్ విజయ్‌కుమార్ దాట్ల ఫౌండేషన్, బయోలాజికల్ ఈ లిమిటెడ్‌కు మోడల్ మార్కెట్ భవనాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఏడాది పాటు అప్పగించారు. స్కిల్లింగ్ అండ్ లివ్లీహుడ్ ప్రోగ్రాం కింద స్లమ్స్‌లోని పేద మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా ఆయా అంశాల్లో తగిన శిక్షణతో నైపుణ్యం కల్పించడంతో పాటు వారికి ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు లభించేలా, ఉపాధి పొందేలా సహకరిస్తామని సదరు ఫౌండేషన్ జీహెచ్ఎంసీకి తెలియజేసింది. తాజాగా ఖైరతాబాద్ జోన్ మెహిదీపట్నం సర్కిల్ మల్లేపల్లి మోడల్ మార్కెట్ బిల్డింగ్‌ను సీఎస్ఆర్ కింద లైట్‌హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్ సొంత నిధులతో సెంటర్ ఫర్ స్కిల్లింగ్ అండ్ లివ్లీ హుడ్ ప్రోగ్రాం ద్వారా శిక్షణ నిర్వహించుకునేందుకు ఒక సంవత్సర కాలం పాటు మార్కెట్‌ను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఎంవోయూ చేసుకునేందుకు బుధవారం స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన 6వ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపారు.

### స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలు

- ఎన్ఎన్‌డీపీ కింద నాగమయ్య కుంట నాలా పొడగింపునకు ప్రతిపాదించిన బాక్స్ డ్రైయిన్ నిర్మాణానికి రూ. 3కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు ఆమోదం.
- హబీబ్‌నగర్ నుంచి చాంద్రాయణగుట్ట మెయిన్ రోడ్, రియాసత్ నగర్ నుంచి హబీబ్ నగర్ వయా పాపాలాల్ టెంపుల్ వరకు రహదారి అభివృద్ధికి జీహెచ్ఎంసీ పరిధిలో 174 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం.
- జీహెచ్ఎంసీ పరిధిలోని 150 వార్డుల్లో క్రీడా కార్యక్రమాల నిర్వహణకు ప్రతి కార్పొరేటర్ డివిజన్‌కు రూ. 2 లక్షల విలువైన ఆటలు/క్రీడల మెటీరియల్ అందించడానికి కమిటీ ఆమోదం.
- పోలీస్‌శాఖకు చెందిన నాంపల్లి వార్డు 45లో పోలీస్ క్వార్టర్స్, గోషామహల్ బంక్, స్టేడియం, బాస్కెట్‌బాల్, బాడ్మింటన్ కోర్టులకు సంబంధించిన 31.39 ఎకరాల భూమిని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నిర్మాణానికి ఎన్ఓసీ జారీ చేసేందుకు జీహెచ్ఎంసీ సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం.

# అక్రమ నల్లాలుంటే.. జైలుకు పంపిస్తాం

### జలమండలి హెచ్చరిక

సిటీబ్యూరో, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): జలమండలి అధికారుల నుంచి అనుమతి లేకుండా అక్రమంగా నల్లా కనెక్షన్ తీసుకున్న ఏడుగురిపై క్రిమినల్ కేసు నమోదైంది. జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నంబర్-18లోని శంషాబాద్ సెక్షన్ పరిధిలో ఉన్న కుమ్మరి బస్తీ, యాదవ్ బస్తీ, కప్పుగడ్డ ప్రాంతాల్లో నివసిస్తున్న బి.రవి, బి.కృష్ణ, బి.కుమార్, బి.అంజయ్య, మహబూబి, కె.బాలరాజ్, టి.భాస్కర్‌లకు రెండేసి నల్లా కనెక్షన్లు ఉన్నాయి. అధికారుల క్షేత్ర స్థాయి తనిఖీల్లో భాగంగా వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను చూపించాలని కోరగా.. అందులో ఒక నల్లా కనెక్షన్‌కు మాత్రమే ధ్రువపత్రాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఈ ఏడుగురు వినియోగదారులపై స్థానిక రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నీటి సరఫరా చేసేందుకు ఉపయోగిస్తున్న ఎలక్ట్రికల్ మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. జలమండలి అధికారుల ఫిర్యాదు మేరకు ఏడుగురిపై పీడీపీపీఏ చట్టం సెక్షన్ 3, భారతీయ న్యాయ సంహిత 326(ఏ) 303 (2) సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. జలమండలి అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా తాగునీటి నల్లా, సీవరేజీ పైపులైన్ కనెక్షన్లు తీసుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఎవరైనా అక్రమ నల్లా, సీవరేజీ కనెక్షన్లు గుర్తిస్తే జలమండలి విజిలెన్స్ బృందానికి 99899 98100, 99899 87135 ఫోన్ నంబర్ల ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు.



# చెరువుల్లో ఆక్రమణలను తొలగిస్తాం!

**ఏడు చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**పునఃపరిశీలించి సర్వే రిపోర్టుల ఆధారంగా చర్యలు**

**ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల సరిహద్దులు ఆక్రమించారంటూ హైడ్రాకు ఫిర్యాదులు**

సిటీబ్యూరో/మణికొండ, దుండిగల్, మెహిదీపట్నం, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): చెరువులకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి కబ్జా కాకుండా చూడాలని, ఆక్రమణలపై పూర్తిస్థాయిలో సమీక్షించి సర్వే నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. చెరువుల కబ్జాలపై వస్తున్న హైడ్రా కార్యాలయానికి ఫిర్యాదుల నేపథ్యంలో కమిషనర్ రంగనాథ్ తన బృందంతో పాటు స్థానిక అధికారులతో కలిసి బుధవారం గ్రేటర్ పరిధిలోని ఏడు చెరువులను సందర్శించారు. నిజాంపేటలోని నిజాంతలాబ్ చెరువు (తురక చెరువు), మాదాపూర్‌లోని మేడికుంట చెరువు, ఈదులకుంట, నార్సింగ్‌లోని నెక్నాంపూర్ చెరువు, తెల్లాపూర్‌లోని వనం చెరువు, చెల్లికుంట, మేళ్ల చెరువులను సందర్శించారు. మేడ్చల్ జిల్లా నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోని తుర్కచెరువులో ఆక్రమణలతో పాటు కలుషిత నీరు కలుస్తుందన్న ఫిర్యాదుతో ఆ చెరువును రంగనాథ్ సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. చుట్టుపక్కల గేటెడ్ కమ్యూనిటీల నుంచి మురుగునీరు చేరి పలు చెరువులు కలుషితం అవుతున్నాయని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో ఉన్న ఈదుల కుంట చెరువును రంగనాథ్ రెవెన్యూ, హైడ్రా అధికారులతో కలిసి పరిశీలించారు. తెల్లాపూర్‌లోని వనం చెరువు, చెల్లికుంట, మేళ్లచెరువులను సందర్శించిన రంగనాథ్‌కు స్థానికులు అక్కడ ఉన్న పరిస్థితులను స్పష్టంగా వివరించారు. గతంలో పనిచేసిన ఇరిగేషన్ అధికారులు ఆక్రమణలకు ఎన్‌వోసీ ఇచ్చారని, వాటిపై కూడా రంగనాథ్ దృష్టిపెట్టాలని కోరారు. చెల్లికుంట వద్ద కల్వర్టు కట్టారని, అసలు పర్మిషన్ ఇవ్వకూడని చోట ఇచ్చారంటూ చెల్లికుంట అలుగు దాటితే వరద వస్తుందని చెప్పారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్‌గ్రామ చిన్న,పెద్ద చెరువులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్థానిక అధికారులతో కలిసి సందర్శించారు. గత కొన్నిరోజులుగా స్థానిక సిటిజన్ కౌన్సిల్, ధృవాన్స్ సంస్థ ప్రతినిధులు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఆక్రమణలకు గురవుతున్నాయంటూ హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో రంగనాథ్ చెరువుల స్థితిగతులపై స్థానిక ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెద్ద చెరువు ఎగువ ప్రాంతంలో చెరువు భూములను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారంటూ కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకువచ్చారు. లేక్‌వ్యూ విల్లాల పేరిట జరుగుతున్న నిర్మాణాల్లో 11 విల్లాల వరకు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపడుతున్నారని..అందులో ఐదు నిర్మాణాలను కూల్చివేసినా తిరిగి నిర్మాణాలు జరుగుతున్నాయని ఇరిగేషన్ అధికారులు రంగనాథ్‌కు తెలిపారు. అనంతరం చిన్నచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధులను ఆయన పరిశీలించారు.వారం రోజులుగా చిన్నచెరువు బఫర్‌జోన్ పరిధుల పరిరక్షణలో భాగంగా ఇరిగేషన్ అధికారులు చేపట్టిన ఫెన్సింగ్ పనులను పర్యవేక్షించారు. ఇక్కడ ఎగువ ప్రాంతంలోనూ చెరువు భూములు ఆక్రమణలకు గురయ్యాయంటూ ఫిర్యాదుదారులు తెలిపారు. ఇందుకు స్పందించిన ఇరిగేషన్ శాఖ జేఈ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎగువ ప్రాంతంలో ఎక్కడా చెరువు సరిహద్దులు ఆక్రమణలకు గురికాలేదని.. ఫెన్సింగ్ వేసే సమయంలో తవ్వి మట్టి కుప్పలు వేసినట్లు చెప్పారు. పూజా కన్‌స్ట్రక్షన్ అపార్ట్‌మెంటులో సగానికి పైగా చెరువు ఎఫ్‌టీఎల్‌లోకి వస్తుందని వారు కమిషనర్‌కు తెలిపారు. రెండు చెరువుల సరిహద్దులపై స్పష్టమైన నివేదికలను సిద్ధం చేసి అందజేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కమిషనర్ రంగనాథ్ కోరారు. నివేదికలను పరిశీలించిన తర్వాత మరోసారి చెరువులను సందర్శిస్తానన్నారు. చెరువుల పరిరక్షణ కోసం ఎక్కడికక్కడా చెరువుల చుట్టూ ఫెన్సింగులు వేసి కాపాడేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు పొంది జరుగుతున్న నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకోబోమని వెల్లడించారు. చెరువుల భూములు ఆక్రమణలకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇరిగేషన్ శాఖ అధికారులకు ఉంటుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.

నెక్నాంపూర్ చిన్నచెరువు సరిహద్దులను పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్